
సాక్షి
ఒడిశా
మంగళవారం । 15 । అక్టోబర్ । 2024



శ్రీమందిరం ఆదాయం లెక్కింపు

భువనేశ్వర్: పూరీ జగన్నాథాలయం హుండీలో భక్తులు కానుకల రూపంలో సమర్పించిన ఆదాయాన్ని పాలకవర్గం సోమవారం లెక్కించారు. ఇందులో నగదు రూ.6,42,726లు, బంగారం 3 గ్రాముల 300 మిల్లీగ్రాములు వెండి 104గ్రాముల 300 మిల్లీగ్రాములు వచ్చాయని అధికారులు తెలిపారు.



శ్రీమందిరానికి కార్తీక శోభ

శ్రీజగన్నాథుడు కొలువుదీరిన శ్రీమందిరానికి కార్తీక శోభ సంతరించుకుంది.

- 8లో



రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం

రాయగడలోని జియోమార్ట్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందింది.

- 8లో

జగజ్జననికి..
జన హారతి



శ్రీమందిరం అభిముఖంగా నిలిచిన దుర్గాదేవి ప్రతిమలు



నగరంలో రావణ దహనం తిలకిస్తున్న ప్రజలు

- జంట నగరాల్లో ముగిసిన దుర్గా నిమజ్జనం

భువనేశ్వర్:

రాష్ట్రంలో జగజ్జనని దుర్గామాతకు భక్తులు వీడ్కోలు పలికారు. భారీ ఊరేగింపుతో పూజలు అందుకున్న ప్రతిమలను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా కటక్, భువనేశ్వర్ జంట నగరాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రధానంగా జల కాలుష్య నివారణ, శాంతి భద్రతల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. దసరా ఉత్సవాల్లో రావణ దహనం కొస మెరుపుగా నిలిచింది. జంట నగరాలతో పాటు రౌర్కెలా, సంబలపూర్, ఖుర్దా, పూరీ, జట్నీ తదితర ప్రాంతాల్లో ఈ కార్యక్రమం అత్యంత ఆనందోత్సాహాలతో ఆదివారం చీకటి పడిన తర్వాత నిర్వహించారు.



కృత్రిమ కొలనులో దేవీ నిమజ్జనం

ప్రత్యేక ఏర్పాట్లు

జంట నగరాల్లో వందలాది దుర్గాదేవి ప్రతిమలను భక్తిశ్రద్ధలతో గౌరవప్రదంగా నిమజ్జనం చేసేందుకు స్థానిక నగర పాలక సంస్థలు ప్రత్యేక ఏర్పాట్లు చేశాయి. ప్రధానంగా జలాశయాల్లో నీటి కాలుష్యం నివారణ కోసం పలుచోట్ల తాత్కాలిక నిమజ్జన కొలనులు ఏర్పాటు చేశారు. నదులు ఇతర జలాశయాల తీరాల్లో ఈ కొలనులు ఏర్పాటు చేశారు. జలాశయాల్లో నీటితో కొలనులు నింపి సురక్షిత నిమజ్జనం కోసం సౌకర్యం కల్పించారు.

శబ్ద కాలుష్య నివారణకు...

జంట నగరాల్లో దేవీ నిమజ్జనం మహోత్సవం పురస్కరించుకుని శబ్ద కాలుష్య నివారణపై జంట నగరాల పోలీసు కమిషనరేట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం ఊరేగింపు కార్యక్రమంలో డీజే అపరిమిత శబ్దం చర్యకు కళ్లెం వేశారు. కాలుష్య నివారణ దృష్ట్యా స్వల్ప శబ్దంతో డీజే వినియోగించడంపై దృష్టి సారించారు. కటక్ ప్రాంతంలో కఠాజొడి నదీ తీరంలో దుర్గాదేవి ప్రతిమలు నిమజ్జనం చేసేందుకు ఏర్పాట్లు చేశారు. భువనేశ్వర్ ప్రాంతంలో 5 వేర్వేరు చోట్ల కృత్రిమ కొలనులు స్థానిక నగర పాలక సంస్థ(బీఎంసీ) ఏర్పాటు చేసింది. స్థానిక కువాఖాయి నదీ తీరంలో 2, దయా నదితీరంలో 2, మరొక కొలను హంసపాల్ సాయి ఆలయం చెరువలో ఏర్పాటు చేసింది. ఈ ప్రాంతాలకు దేవీ ప్రతిమలను తరలించేందుకు పోలీసు యంత్రాంగం ప్రత్యేక ట్రాఫిక్ నిబంధనలు అమలు చేసింది. సాధారణ జన జీవనం ప్రభావితం కాకుండా దేవీ రథాలు ఊరేగించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేశారు.

రావణ దహనం

ఇటీవల కాలంలో దుర్గా పూజోత్సవాల్లో రావణ దహనం వేడుకగా నిర్వహిస్తున్నారు. నగరంలో 9 చోట్ల రావణ కాష్ట ఏర్పాటు చేసేందుకు అనుమతించారు. ఈ క్రమంలో ఝరపడా, బరముండా, నొహరొఖొంటా, కొరొడాకొంటా, బంకువాల్, గోపాలపూర్, కిట్ రోడ్, చందకా, సిములియా ప్రాంతాల్లో రావణ దహనం ఏర్పాటు చేశారు. స్థానిక నయాపల్లి ప్రాంతం రావణ కాష్టలో రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ప్రభాతి పరిడా పాల్గొని రావణ దిష్టి బొమ్మకు నిప్పు అంటించి రావణ కాష్టని ప్రారంభించారు.


భువనేశ్వర్: శ్రీజగన్నాథుని క్షేత్రం పూరీ పట్టణంలో దుర్గాదేవి పూజోత్సవాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఈ ఉత్సవాల్లో పూజలు అందుకున్న దుర్గాదేవి ప్రతిమల అణుపు అత్యంత వేడుకగా నిర్వహించారు. దీనిలో విభిన్నత ఇమిడి ఉంది. పట్టణ వ్యాప్తంగా పలుచోట్ల ఏర్పాటు చేసిన పందిళ్లలో పూజలు అందుకున్న దుర్గామాత ప్రతిమలు అన్నీ శ్రీజగన్నాథుని దేవస్థానం శ్రీమందిరం సింహద్వారం ఆవరణ అరుణ స్తంభం ప్రాంగణంలో మేఘనాథ్ ప్రహరీ పరిసరాలకు చేరాయి. అన్ని చేరిన తర్వాత వరుస క్రమంలో ఒక్కొటిగా నిమజ్జనం కోసం పూరీ సాగరం వైపు తరలి వెళ్లాయి. దీనిని ఘొసాణి జాతరగా స్థానికులు జరుపుకున్నారు. శ్రీజగన్నాథుని సంస్కృతిలో ఇది ప్రాచీన పరంపర. సుమారు 800 ఏళ్ల క్రితం దాదాపు 11, 12 శతాబ్దాల నుంచి గొసాణి జాతర పూరీలో ప్రారంభమైనట్లు చరిత్రకారుల సమాచారం. శాంతి భద్రతలతో గొసాణి జాతర విజయవంతం చేయడంలో పూరీ జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది.



నయాపల్లి ప్రాంతంలో ఏర్పాటు చేసిన రావణ దహనం

న్యూస్‌రీల్

గాంధీ విగ్రహం ఏర్పాటు



పార్కులో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహం

రాయగడ: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న గాంధీ పార్కులో 32 అడుగుల భారీ గాంధీ విగ్రహం ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఫైబర్‌తో రూపొందించిన విగ్రహాన్ని పార్క్ ప్రవేశ ద్వారం వద్ద ఏర్పాటు చేశారు. అన్ని హంగులు పూర్తైన తర్వాత దీనిని ప్రారంభిస్తారు.

వ్యాన్ బోల్తా

- ఆరుగురికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు

కొరాపుట్: రావణ దహనం నుంచి తిరిగి వస్తున్న వ్యాన్ బోల్తా పడడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. ఆదివారం రాత్రి నబరంగ్‌పూర్ జిల్లా పపడాహండి సమితి కేంద్రంలో రావణ దహనం జరిగింది. దీనిని తిలకించడానికి కెరండి గ్రామం నుంచి 33 మంది యువకులు ఒక పికప్ వ్యాన్‌లో బయల్దేరారు. ఈ వ్యాన్ బోల్తా పడడంతో ఆరుగురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరిని పపడాహండి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్య సిబ్బంది అందుబాటులో లేరు. దీంతో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు.

వినతుల స్వీకరణ



వినతులు స్వీకరిస్తున్న అధికారులు

రాయగడ: జిల్లాలోని పద్మపూర్ సమితి కార్యాలయం ప్రాంగణంలో జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర రైతా అధ్యక్షతన వినతుల స్వీకరణ కార్యక్రమం సోమవారం జరిగింది. ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, గుణుపూర్ సబ్ కలెక్టర్ కిరణ్ దీప్ కౌర్ సహోత, జిల్లా ముఖ్య వైద్యాధికారి డాక్టర్ లాల్ మోహన్ రౌత్రాయ్, సమితి అధ్యక్షురాలు మణిమాల శబర్ తదితరులు పాల్గొన్నారు. వివిధ ప్రాంతాలకు చెందిన 29 వినతులను పరిశీలించిన అధికారులు, వాటి పరిష్కారానికి సంబంధిత శాఖ అధికారులకు ఆదేశించారు. గ్రామాలకు రహదారులు, తాగు, సాగునీరు తదితర మౌలిక సౌకర్యాలను మెరుగు పరచాలని అధిక శాతం మంది గ్రామస్తులు సమర్పించిన ఫిర్యాదుల్లో పేర్కొన్నారు.

కల్వర్టు మరమ్మతులకు ఎమ్మెల్యే విరాళం



కల్వర్టు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే నర్సింగ బోత్ర

కొరాపుట్: కల్వర్టు మరమ్మతులకు ఎమ్మెల్యే వ్యక్తిగతంగా విరాళం ఇచ్చారు. సోమవారం నబరంగ్‌పూర్ జిల్లా జొరిగాం ఎమ్మెల్యే నర్సింగ బోత్ర ఉమ్మర్‌కోట్ పర్యటన ముగించుకొని ఇంటికి తిరిగి వస్తున్నారు. ఆ సమయంలో ఫుడాఘడ్ సమీపంలోని బొడమండయ్ సమీపంలో ఒక కల్వర్టు కూరుకుపోయి ఉండడం గమనించారు. వెంటనే స్థానికులను పిలిచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీ శాఖ వారు నిర్మించిన ఈ కల్వర్టు ఇటీవల కురిసిన వర్షాలకు కూరుకుపోయినట్లు తెలుసుకున్నారు. దీంతో మరమ్మతులు చేయడానికి వ్యక్తిగతంగా సాయం అందజేశారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీలోకి కొత్తగా 65 వేల మంది

- ఎంపీ పరశురాం మాఝి

రాయగడ: రాష్ట్రంలో బీజేపీ కొలువుదీరడంతో పార్టీలో చేరేందుకు ఎంతోమంది ఉత్సుకత చూపిస్తున్నారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు, ఎంపీ పరశురాం మాఝి అన్నారు. స్థానిక సిరిగుడలోని బీజేపీ కార్యాలయంలో కార్యకర్తలు, పార్టీ నాయకులతో సోమవారం సమావేశమయ్యారు. జిల్లాలో సభ్యత్వ నమోదుకు సంబంధించి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ మరింత బలోపేతానికి అంతా కలసికట్టుగా కృషి చేయాలన్నారు. జిల్లాలో సభ్యత్వ సేకరణ ప్రారంభించినప్పటి నుంచి ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 60 వేల మంది కొత్తగా పార్టీలో చేరారన్నారు. అదేవిధంగా ఆఫ్‌లైన్‌లో మరో 25 వేల మంది కొత్తగా సభ్యత్వం తీసుకున్నారని వివరించారు. జిల్లా అధ్యక్షుడు శివకుమార్ పట్నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని బిసంకటక్, రాయగడ, గుణుపూర్ శాసన సభ నియోజకవర్గాల్లో ప్రతీ నియోజకవర్గం నుంచి లక్ష మందికిపైగా సభ్యులను చేర్పించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర శాఖ ఎస్సీ, ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు కాళీరాం మాఝి, ఓబీసీ మోర్చ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామచంద్ర బెహర తదితరులు పాల్గొన్నారు.



ఎంపీ పరశురాం మాఝికి స్వాగతం పలుకుతున్న శివ పట్నాయక్

పర్లాకిమిడిలో అనుపోత్సవం



పర్లాకిమిడి: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఆదివారంతో ముగిశాయి. దీంతో అనేక కూడళ్లలో వెలసిన దుర్గా విగ్రహాలను సోమవారం అనుపోత్సవానికి ఉపక్రమించారు. విద్యుత్ శాఖ (టాటా), పెద్ద బ్రాహ్మణ వీధి, సొండివీధి, పీహెచ్‌ఈడీ, హైస్కూల్ జంక్షన్‌ల వద్ద వెలిసిన దుర్గామాత విగ్రహాలను ఆనందోత్సహాలతో అనుపోత్సవం చేశారు.

బైక్‌ని ఢీకొని మంటల్లో చిక్కుకున్న బస్సు



దగ్ధమైన బస్సు



మంటల్లో చిక్కుకున్న బస్సు

- ఒకరు మృతి

భువనేశ్వర్: దూసుకుపోతున్న ప్రయాణికుల బస్సు బైక్‌ని ఢీకొని మంటల్లో చిక్కుకుంది. ఈ ఆకస్మిక దుర్ఘటనలో ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. ఈ ఘటన జాజ్‌పూర్ జిల్లా 16వ నంబర్ జాతీయ రహదారి ఛొత్తియా ప్రాంతంలో సోమవారం చోటు చేసుకుంది. మృతుని ఆచూకీ తెలియాల్సి ఉంది. మయూర్‌భంజ్ జిల్లా బరిపద నుంచి భువనేశ్వర్‌కు వస్తున్న చొక్కడొలా ప్రైవేటు బస్సు ఎదురుగా వస్తున్న బైక్‌ని ఢీకొంది. స్పీడ్ బ్రేకర్ అధిగమించే సమయంలో అదుపుతప్పడంతో బస్సు ప్రమాదానికి కారణమైనట్లు ప్రత్యక్ష సాక్షుల కథనం. బైక్‌ని కొంతదూరం బస్సు ఈడ్చుకుపోవడంతో బైక్‌పై వ్యక్తి ఘటనా స్థలంలో మృతి చెందాడు. మంటలు వ్యాపించేలోగా బస్సులోని ప్రయాణికులను కిందకి దించడంతో వీరంతా బతికి బయటపడగలిగారు. విషయం తెలియడంతో స్థానిక బొరియా ఠాణా పోలీసులు ఘటనా స్థలం సందర్శించారు. ఘటనా స్థలంలో మృతదేహాన్ని పంచనామా కోసం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అగ్నిమాపక దళం, ఒడ్రాఫ్ దళం ఘటనా స్థలానికి మంటలు నివారించారు.

ఆశ కార్యకర్తల ఆందోళన

రాయగడ: తమ దీర్ఘకాల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపిస్తూ రాష్ట్ర ఆశ కార్యకర్తల సంఘం పిలుపు మేరకు ఆ సంఘం జిల్లా శాఖ సోమవారం ఆందోళన చేపట్టింది. స్థానిక గాంధీ పార్క్ నుంచి వందలాది మంది ఆశ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. సంఘం జిల్లా అధ్యక్షురాలు తమాల్ సాహుకార్, కార్యదర్శి గీతాంజలి హియాల్‌ల నేతృత్వంలో 7 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని డిప్యూటీ కలెక్టర్ లలిత్ మండల్‌కు సమర్పించారు. కార్మిక నాయకుడు, భారతీయ మజ్దూర్ సంఘ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోగేశ్వర్ దాస్, జిల్లా కార్యదర్శి గణేష్ కుమార్ సాహు, ఒడిశా రాష్ట్ర ఆశ కార్యకర్తల సంఘం ఉపాధ్యక్షురాలు మమత బిశ్వాల్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. లేదంటే ప్రతీ ఆశ కార్యకర్తకు నెలకు రూ.28 వేల వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. అదేవిధంగా ఆశ కార్యకర్తలకు సామాజిక సురక్ష కల్పించాలన్నారు.

మల్కన్‌గిరి: రాష్ట్రవ్యాప్త నిరసనలో భాగంగా జిల్లాలోని 7 సమితులకు చెందిన వందలాది మంది ఆశ కార్యకర్తలు పట్టణంలో భారీ ర్యాలీని నిర్వహించి కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి, దేశ ప్రధాని పేరిట వివరించిన ఒక వినతిపత్రంను కలెక్టర్ ఆశిష్ ఈశ్వర్ పటేల్‌కు సమర్పించారు. సీహెచ్‌సీ, పీహెచ్‌సీ ప్రాంతాల్లో ఆశ కార్యకర్తలకు నివాస గృహాలు, రూ.5 వేల పెన్షన్, రూ.28 వేల జీతాన్ని చెల్లించాలన్నారు. అలాకాని పక్షంలో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు.



రాయగడ: భారీ ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తల



రాయగడ: కలెక్టర్ కార్యాలయం ఎదుట బైఠాయించిన కార్యకర్తలు



మల్కన్‌గిరి: ర్యాలీ నిర్వహిస్తున్న ఆశ కార్యకర్తలు

చెలరేగిన మంటలు



ఢెంకనాల్ జిల్లాలో ఆగివున్న బస్సు మంటల్లో చిక్కుకుంది. ఆదివారం అర్ధరాత్రి పూట ఈ ప్రమాదం సంభవించింది. స్థానికులు గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి తెలియజేశారు. ఢెంకనాల్ శిశు మందిర్ విద్యా సంస్థ పరిసరాల్లో ఈ సంఘటన చోటు చేసుకుంది. అగ్నిమాపక దళం మంటలను నివారించారు. ప్రయాణికులు లేనందున ప్రాణహాని తొలగింది.

- భువనేశ్వర్

క్లుప్తంగా

కార్మికుల సంక్షేమానికి టాస్క్‌ఫోర్స్

భువనేశ్వర్: రాష్ట్రంలో వలస కార్మికుల బాగోగుల పర్యవేక్షణ కోసం ప్రభుత్వం నడుం బిగించింది. పొట్టకూటి కోసం దేశంలోని పలు ప్రాంతాలకు కార్మికులు వలస పోతున్నారు. పలు సందర్భాల్లో ఆయా ప్రాంతాల్లో ఊహాతీతమైన ఇబ్బందుల్లో చిక్కుకుని ప్రాణాపాయ పరిస్థితులను ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇటువంటి సంఘటనలు ఇటీవల కాలంలో తరచూ సంభవిస్తున్నాయి. దీంతో ఈ పరిస్థితుల నివారణ కోసం ఉప ముఖ్యమంత్రి కనక వర్ధన్ సింగ్ అధ్యక్షతన ప్రభుత్వం ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేసింది. ఈ బృందంలో ఉప ముఖ్యమంత్రి, మహిళా – శిశు అభివృద్ధి శాఖ మంత్రి ప్రభాతి పరిడాతో పలువురు మంత్రులు, ప్రభుత్వ ప్రముఖ కార్యదర్శి సభ్యులుగా కొనసాగుతారు. కార్మికుల వలస నేపథ్యంలో వెలుగు చూస్తున్న ఆకస్మిక పరిణామాలు, వలస వెళ్లిన ప్రాంతాల్లో రాష్ట్ర కార్మికుల అసౌకర్యాలు వంటి సమస్యాత్మక పరిస్థితుల నివారణతో సమగ్ర సంక్షేమం ధ్యేయంగా ఉన్నత స్థాయి టాస్కు ఫోర్సు ప్రత్యేక మార్గదర్శకాలను ప్రభుత్వానికి సమర్పిస్తుంది. ఈ దిశలో వలస కార్మికుల బాగోగులు పర్యవేక్షించే పలు అనుబంధ సంస్థల సలహాలు, సంప్రదింపులు, సహాయ సహకారాల్ని టాస్కు ఫోర్సు పరిగణనలోకి తీసుకుంటుందని సోమవారం జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొన్నారు.

విహార యాత్రకు వెళ్లి ఇంటర్ విద్యార్థి గల్లంతు

- నదిలో కొట్టుకుపోయిన వైనం
- రెండు రోజులుగా గాలిస్తున్నా కానరాని ఆచూకీ


సాత్విక్

అగనంపూడి(విశాఖ): విహారయాత్రకు వెళ్లి నదిలో కొట్టుకుపోయిన విద్యార్థి కోసం ఒడిశా పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే అగనంపూడి నిర్వాసిత కాలనీ కొండయ్యవలసకు చెందిన యువ రచయిత కంచిపాటి నరసింహమూర్తి తన కుమారుడు సాత్విక్ (18) గాజువాకలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. దసరా సెలవులకు సాత్విక్‌తోపాటు ఆమె సోదరి మౌని ఒడిశాలోకి సుందర్‌ఘర్ ఎన్టీపీసీలో పనిచేస్తున్న తన మేనమామ ఇంటికి వెళ్లారు. ఆదివారం మధ్యాహ్నం అక్కడ ఉన్న ఐదు కుటుంబాలకు చెందిన 18 మంది బలిశంకర్ బ్లాక్ పరిధిలోని ఘోగర్ కునకుంద నదికి విహార యాత్రకు వెళ్లారు. స్నానం చేస్తుండగా నీటి ఉధృతికి సాత్విక్ గల్లంతయ్యాడు. తలసారా పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని గల్లంతైన యువకుని కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సోమవారం రాత్రి వరకు ఆచూకీ లభ్యం కాకపోవడంతో అగనంపూడిలోని బాలుని తల్లిదండ్రులు, బంధువులు తల్లడిల్లుతున్నారు.

కుస్తీ పోటీల్లో వెండి పతకం


భాస్కరరావును అభినందిస్తున్న దుర్గాప్రసాద్, మోహనరావు

నరసన్నపేట: స్థానిక పద్మావతి జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి నర్శిపురం భాస్కరరావు రెజ్లింగ్ (కుస్తీ) విభాగంలో రాష్ట్ర స్థాయిలో జరిగిన పోటీల్లో వెండి పతకం సాధించాడు. విజయవాడలో నిర్వహించిన 68వ రెజ్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో రెండో స్థానం లభించింది. ఈ మేరకు కళాశాల డైరెక్టర్ సీహెచ్ దుర్గాప్రసాద్ తెలిపారు. పోలాకి మండలం వనవిష్ణుపురానికి చెందిన భాస్కరరావును కళాశాల యాజమాన్యం అభినందించింది. జిల్లా పేరును నిలిపినందుకు ప్రత్యేకంగా కళాశాల ప్రిన్సిపల్ మసలినాయుడు, ఏటమెండ మోహనరావు సత్కరించారు.

అనుమానాస్పదంగా వివాహిత మృతి

సంతబొమ్మాళి: మండలం తెనిగిపెంట గ్రామానికి చెందిన వివాహిత పెంట రేవతి (19) మృతి చెందడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఇన్‌చార్జి సంతబొమ్మాళి ఎస్ఐ జి.నారాయణస్వామి సోమవారం తెలిపారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. రేవతికి అదే గ్రామానికి చెందిన పెంట లక్ష్మయ్యతో గత ఏడాది వివాహం జరిగింది. ఈ నెల నాలుగో తేదీన రేవతి కనిపించడం లేదని కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. ఈ నెల ఆరో తేదీన గ్రామంలోని పాఠశాల సమీపంలో బావిలో ఆమె మృతదేహం బయటపడింది. అదే రోజు దహన సంస్కారాలు కూడా చేశారు. మృతిపై వివాహిత కుటుంబ సభ్యులకు అనుమానాలు రావడంతో పోలీసులను ఆశ్రయించారు. మృతురాలు తల్లి జయమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అయితే మృతురాలు ఆత్మహత్య చేసుకుందా లేక హత్య చేశారా అన్నది తేలాల్సి ఉంది. పోస్టుమార్టం రిపోర్టు ప్రకారం ఏం జరిగిందో నిర్ధారిస్తామని పోలీసు లు తెలిపారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశామని దీనిపై దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ నారాయణ స్వామి తెలిపారు.

కొనసాగుతున్న దసరా ఉత్సవాలు

రాయగడ:

పట్టణానికి సుమారు 10 కి.మీ దూరంలోని జేకేపూర్‌లో జేకే పేపర్ మిల్ ఆధ్వర్యంలో ఈనెల 9వ తేదీ నుంచి నిర్వహిస్తున్న దసరా ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. దీనిలో భాగంగా ఆదివారం రాత్రి జేకే ఎరోడ్రం మైదానంలో నిర్వహించిన రావణ దహనం కార్యక్రమానికి ఎస్పీ స్వాతి ఎస్.కుమార్, కొరాపుట్ లోక్‌సభ ఎంపీ సప్తగిరి శంకర్ ఉలకలు అతిథులుగా హాజరయ్యారు. సుమారు 62 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన రావణ బొమ్మను సాంప్రదాయ పద్ధతిలో పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ఎస్పీ స్వాతి నిప్పుపెట్టి తగులబెట్టారు. ఈ కార్యక్రమాన్ని వీక్షించేందుకు సుమారు లక్ష మందికి పైగా జనం హాజరయ్యారు. ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేందుకు పోలీస్ యంత్రాంగం కట్టుదిట్టమైన చర్యలను తీసుకుంది.


రావణ దహనానికి నిప్పుపెడుతున్న ఎస్పీ స్వాతి


ఈనెల 18 వరకు ఉత్సవాలు

ప్రతీ ఏడాదిలా ఈసారి కూడా జేకే పేపర్ మిల్ యాజమాన్యం దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించింది. తిరుపతి వెంకన్న ముఖద్వారం తరహా పూజా పెండాల్‌ను ఏర్పాటు చేయడంతో ఉత్సవాలకు మరింత శోభ చేకూరింది. ఉత్సవాల సందర్భంగా జేకేపూర్ ప్రాంతం విద్యుత్ దీపాలంకరణలతో ధగధగ మెరుస్తోంది. ప్రతీరోజు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.


ఉత్సవాల్లో ఏర్పాటు చేసిన మీనా బజార్


ఉత్సవాల్లో పాల్గొన్న ఎంపీ సప్తగిరి దంపతులు


పూజలందుకుంటున్న దుర్గా అమ్మవారు


తిరుపతి వెంకన్న మందిరం గోపురం తరహా పెండాల్


రావణ దహనం

గణిత సమస్యల పరిష్కార శిబిరం


గణిత సమస్యల పరిష్కార శిబిరంలో పాల్గొన్న బృందం

భువనేశ్వర్: స్థానిక భారతీయ సాంకేతిక సంస్థ (ఐఐటీ) క్యాంపస్‌లో లాజికల్ థింకింగ్, ఓపెన్ మైండ్‌నెస్ శీర్షికతో గణిత సమస్యల పరిష్కార శిబిరం సోమవారం ప్రారంభించారు. నిర్వాహక సంస్థ డైరెక్టర్ ప్రొఫెసర్ శ్రీపాద కర్మలకర్ ఆధ్వర్యంలో 3 రోజులపాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర న్యాయ, అబ్కారీ, నిర్మాణ శాఖ మంత్రి పృథ్వీరాజ్ హరిచందన్, రాష్ట్ర ఎలక్ట్రానిక్స్, సాంకేతిక సమాచారం, ఆరోగ్య – కుటుంబ సంక్షేమం, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ముఖేష్ మహాలింగ్‌లు ప్రారంభించారు. 2036 సంవత్సరం నాటికి ఒడిశా ప్రత్యేక రాష్ట్ర ఆవిర్భావం శత జయంతి జరుపుకుంటుంది. ఆ సమయానికి రాష్ట్రంలో గణిత, వైజ్ఞానిక రంగంలో యువ మేధావుల్ని ఆవిష్కరించే దృఢ సంకల్పంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు మంత్రులు ప్రసంగంలో పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 జిల్లాల నుంచి ఎంపికైన 40 మంది విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొంటున్నారు. వీరంతా అండర్ గ్రాడ్యుయేట్లు. గణిత శాస్త్రంలో సంక్లిష్టమైన సమస్యలను సరళీకరించి సునాయాసంగా సమాధానపరిచే మెలకువలను ఈ శిబిరంలో అభ్యసిస్తారు. గణితం, విజ్ఞాన శాస్త్రం రంగాల్లో నిపుణులు ఈ శిబిరంలో విద్యార్థులతో ముఖాముఖి స్పందించడం విశేషంగా పేర్కొన్నారు.


ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రులు పృథ్వీరాజ్ హరిచందన్, డాక్టర్ ముఖేష్ మహాలింగ్

కాలువలో పడి వృద్ధురాలు మృతి

టెక్కలి రూరల్: మండలంలోని రావివలస గ్రామానికి చెందిన పైల కరువమ్మ(58) అనే వృద్ధురాలు కాలువలో పడి మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. కరువమ్మ మూడు రోజుల కిందట బహిర్భూమి కోసం కాలువ వద్దకు వెళ్లి అందులో పడిపోయింది. మూడు రోజులుగా ఆమె కనిపించకపోవడంతో బంధువుల ఇంటికి వెళ్లి ఉంటుందని కుటుంబ సభ్యులు అనుకున్నారు. అయితే సోమవారం గ్రామంలో కాలువ సమీపంలో వెళ్తున్న వారికి దుర్వాసన రావడంతో అక్కడ చూడగా మృతదేహం కనిపించింది. దీంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మృతురాలికి భర్త, పిల్లలు ఎవరూ లేకపోవడంతో వారి మేనల్లుడు గ్రామస్తుల సహకారంతో అంత్యక్రియలు నిర్వహించారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి దుర్మరణం


మృతి చెందిన పార్వతి

రాయగడ: స్థానిక జియోమార్ట్ సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వృద్ధురాలు మృతి చెందగా, మరొకరు తీవ్రగాయాలపాలయ్యారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసులు తెలియజేసిన వివరాల ప్రకారం.. ఈ ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి జేకేపూర్‌కు చెందిన బి.పార్వతి (65)గా గుర్తించారు. గాయాలు పాలైన వ్యక్తి ఎ.తరుణ్ కుమార్‌గా సమాచారం. జేకేపూర్‌కు చెందిన పార్వతీ, ఆమె మనవడు తరుణ్‌లు ఒక బైకుపై రాయగడకు పనిమీద వచ్చారు. పనులు ముగించుకున్న అనంతరం తిరిగి మధ్యాహ్నం జేకేపూర్‌కు వెళ్తున్న సమయంలో స్థానిక జియోమార్ట్‌కు సమీపంలో వెనుకనుంచి ఒక లారీ ఢీకొనడంతో బైకు అదుపుతప్పి కిందపడిపోయింది. దీంతో బైకు వెనుక కూర్చున్న పార్వతీ కొంతదూరం ఎగిరిపడి కిందపడిపోయింది. తీవ్రగాయాలకు గురైన ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, బైకు నడుపుతున్న తరుణ్ గాయాలు పాలయ్యాడు.


ప్రమాదానికి కారణమైన లారీ

నందెమ్మ ఉత్సవాలకు ముస్తాబు


కటికి వీధిలో నందెమ్మలను తయారు చేస్తున్న కళాకారుల కుటుంబాలు

పర్లాకిమిడి: జిల్లాలోని పలు గ్రామీణ ప్రాంతాల్లో బుధవారం నుంచి నందెమ్మ ఉత్సవాలు జరగనున్నాయి. దీంతో స్థానిక చిత్రకార వీధిలో మట్టి విగ్రహాల తయారీకి గిరాకీ ఏర్పడింది. వినాయక చవితి మొదలు గౌరీ పౌర్ణమి వరకూ పర్లాకిమిడిలో పలు పండుగలకు దేవతా విగ్రహాల తయారీపై ఆధారపడుతూ పది కుటుంబాలు జీవనం సాగిస్తున్నారు. పట్టణంలోని గుసాని సమితి బాగుసాల, జాజిపురం, కత్తలకవిటి, ఉప్పలాడ, కుద్దడ, ఆర్.సీతాపురం , బ్రాహ్మణ సీతాపురం, కాశీనగరంలో ఇస్తల, కె.సీతాపురం గ్రామాల్లో నందెమ్మ ఉత్సవాలు పది రోజుల పాటు ఆడంబరంగా జరుపుతారు.


అమ్మకానికి సిద్ధంగా ఉన్న నందెమ్మ విగ్రహాలు

నవరంగ్‌పూర్‌లో ప్రిన్సిపల్ సెక్రటరీ పర్యటన

కొరాపుట్: నవరంగ్‌పూర్‌లో యువజన, క్రీడా విభాగ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ, జిల్లా నోడల్ అధికారి భాస్కర్ జ్యోతి శర్మ సోమవారం పర్యటించారు. దీనిలో భాగంగా నందాహండిలో వంద పడకల మోడల్ హాస్టల్ భవన నిర్మాణం, 22 గ్రామాలకు నీరందించే మెగా పైపు ప్రాజెక్ట్ నిర్మాణ పురోగతి, తెంతులకుంటిలోని హైటెక్ గార్డెన్ ఫాం, జిల్లా కేంద్ర ఆస్పత్రిలో బ్లడ్ బ్యాంక్, ఎమర్జెన్సీ మెడికల్ బ్లాక్‌లను పరిశీలించారు. ఆయనతో పాటు కలెక్టర్ డాక్టర్ శుభంకర్ మహాపాత్రో ఉన్నారు.


జిల్లా కేంద్ర ఆస్పత్రి పరిశీలిస్తున్న ప్రిన్సిపల్ సెక్రటరీ భాస్కర్ జ్యోతి శర్మ తదితరులు

రైతుల ఆందోళన


రైతులతో మాట్లాడుతున్న ఎస్డీపీవో మాధవానంద నాయక్

పర్లాకిమిడి: గజపతి జిల్లా గుసాని సమితిలోని అనేక పంచాయతీల్లో ఖరీఫ్ పంటకు సాగునీటిని అందించడంలో అధికారులు విఫలమయ్యారని రైతులు ఆరోపించారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం ఏడోమైలు వద్ద ఆందోళన చేపట్టారు. దాదాపు మూడు గంటల సేపు రాస్తారోకో చేపట్టడంతో అనేక వాహనాలు రోడ్డుపై నిలిచిపోయాయి. గుసాని సమితిలో బట్టి సిరిపురం, మధుసూదనపూర్, ఉప్పలాడ, కోర్సండ, ఏడోమైలు, రాజసీతాపురం, బాగుసల, తంపరకవిటి, బాపూజీపేట, కెరండీ, రట్టిని, అమర గ్రామాల్లో సాగునీటి పంట కాలువల్లో పూడికలు తీయకపోవడంతో పంటకు నష్టాలు చేకూరాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు సాగునీటి అందక కష్టాలు పడుతుంటే ఇరిగేషన్ అధికారులు దసరా పండుగకు వారి ఊళ్లకు వెళ్లి ఇంతవరకూ తిరిగి రావడం లేదని వాపోయారు. ప్రతిఏటా రైతులు ఆందోళన చేయడం, అధికారులు వచ్చి హామీలు ఇవ్వడమే మిగిలిపోతోందని విమర్శించారు. దీంతో తహసీల్దార్ నారాయణ బెహరా, సబ్ డివిజనల్ పోలీసు అధికారి మాధవానంద నాయక్, చిన్ననీటి పారుదల శాఖ అసిస్టెంట్ ఇంజినీర్ ఆశిష్ మల్లిక్ రైతులకు నచ్చజెప్పారు. మంగళవారం నుంచి సాగునీటి కాలువల్లో పనులు చేపడతామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ఆందోలన విరమించారు.


ఆందోళన చేస్తున్న రైతులు

శ్రీమందిరానికి కార్తీక శోభ

- ప్రారంభమైన హబిషాలీల రాక
- నిత్యం రాధా దామోదర అలంకరణ

భువనేశ్వర్: శ్రీ జగన్నాథుడు కొలువుదీరిన శ్రీమందిరం భక్తుల తాకిడితో కిటకిటలాడుతోంది. పవిత్ర కార్తీక మాసం పురస్కరించుకుని ఈ పరిస్థితి నెలకొంది. ఈ మేరకు దేవస్థానం అధికార యంత్రాంగం ప్రత్యేక కార్యాచరణ ఖరారు చేసింది. కార్తీక మాసం పురస్కరించుకుని రత్న వేదికపై మూల విరాటులు రాధా దామోదర అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తారు. ఈ అలంకణలో దర్శనం కోసం భక్తులు తండోప తండాలుగా తరలి వస్తారు. ఈ సందర్భంగా మూల విరాటులకు బాల భోగం నివేదించడం ఆచారం.

కార్తీక వ్రతం

శ్రీక్షేత్రం హబిషాలీల ఆగమనంతో కొత్త కళ సంతరించుకుంటుంది. ఏటా కార్తీక మాసం పురస్కరించుకుని మహిళలు ప్రధానంగా వితంతువులు పెద్ద సంఖ్యలో ఈ వ్రతం అత్యంత నియమ నిష్టలతో ఆచరిస్తారు. శ్రీజగన్నాథుని సన్నిధిలో కార్తీక వ్రతం పరమ భాగ్యమని భావిస్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హబిషాలీలు తరలి వస్తారు. ముందస్తు కార్యాచరణతో వీరి కోసం శ్రీమందిరం దేవస్థానం, పూరీ జిల్లా యంత్రాంగం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. వీరి ఆగమనం అశ్వినీ కృష్ణ పక్షం ఏకాదశి పురస్కరించుకుని సోమవారం నుంచి ఆరంభమైంది. ఈ సందర్భంగా దేవుళ్లకు బాల భోగం నివేదన ఆరంభించారు. అశ్వినీ మాసం కుమార పూర్ణిమ నుంచి హబిషాలీ వ్రతం కోసం విచ్చేసే వారి తాకిడి మరింత పుంజుకుంటుంది. శ్రీమందిరంలో ఏకాదశి నుంచి కార్తీక ప్రత్యేక పూజాదులు ప్రారంభించారు. నిత్యం వేకువజామున 4 గంటలకు శ్రీ మందిరం సింహద్వారం ప్రధాన ద్వారాలు తెరుస్తారు.


కార్తీక కాంతులీనుతున్న శ్రీమందిరం

కొత్త దర్శన విధానం

శ్రీజగన్నాథుని దర్శనం సులభతరం చేసే దిశలో అనుబంధ యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. శ్రీమందిరంలో ధ్వజ స్తంభం నుంచి రత్న వేదికపై మూల విరాటులను సంతృప్తిగా దర్శించుకునేందుకు వీలుగా ర్యాంప్ ఏర్పాటు చేస్తున్నారు. బారికేడ్ల గుండా వరుస క్రమంలో భక్తులను అనుమతించి గర్భగుడిలో రత్న వేదికపై దేవుళ్లని దర్శించుకునేందుకు వీలుగా ఈ ప్రయోగాత్మక చర్యకు శ్రీకారం చుట్టారు. గర్భ గుడిలో వరుస పద్ధతిలో దర్శనం కోసం ఏర్పాటు చేసే బారికేడ్లు అవసరానికి అనుగణంగా తొలగించేందుకు వీలుగా కర్రతో తయారు చేశారు. కార్తీక మాసంలో అప్పుడప్పుడు ఈ వ్యవస్థని ప్రయోగాత్మకంగా అమలుజేసి ఈ ఏడాది నవంబర్ నెలలో పూర్తిస్థాయిలో ప్రవేశ పెట్టాలని శ్రీ మందిరం పాలక వర్గం యోచిస్తోంది.


రాధా దామోదర అలంకరణ

క్లుప్తంగా

తండ్రీకొడుకులకు తీవ్ర గాయాలు

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ



ప్రమాదంలో చేతిని కోల్పోయిన బాలుడు

దత్తిరాజేరు: మండలంలోని షికారుగంజి కూడలి వద్ద జాతీయ రహదారిపై ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో జరిగిన ప్రమాదంలో తండ్రీ కొడుకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ మేరకు సోమవారం ఎస్.బూర్జవలస ఎస్సై రాజేష్, స్థానికులు ఈ ఘటనపై తెలిపిన వివరాల ప్రకారం..సాలూరు నుంచి గజపతినగరం వెళ్తున్న ఆర్టీసీ బస్సును పెదమానాపురం నుంచి రామభద్రపురం వెళ్తున్న లారీ ఢీకొనడంతో బస్సులో ప్రయాణిస్తున్న ఒడిశా రాష్ట్రం కొరాపుట్ జిల్లా పొట్టంగి గ్రామానికి చెందిన తండ్రీకొడుకులు మజ్జి సందు, బుల్లేష్‌లకు గాయాలవడంతో వెంటనే 108లో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. బుల్లేష్‌కు చేతికి బలమైన గాయమై చెయ్యి శరీరంనుంచి విడిపోవడంతో వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. తండ్రి విజయనగరంలో చికిత్స పొందుతున్నాడని, ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన కారు



విద్యుత్ స్తంభాలను ఢీకొట్టిన కారు

గంట్యాడ: విజయనగరంనుంచి ఓ వ్యక్తి కారులో బొడ్డవర వెళ్తుండగా మార్గమధ్యంలో గంట్యాడ మండలంలోని మదనాపురం మోడల్ స్కూల్ వద్ద విద్యుత్ రెండు విద్యుత్ సంభాలను ఢీకొట్టడంతో అవి విరిగిపోయాయి. అయితే విద్యుత్ తీగలు కారుపై పడకపోవడంతో అదృష్టవశాత్తు పెనుప్రమాదం తప్పింది. కారులో ఉన్న వ్యక్తి సురక్షితంగా బయట పడ్డాడు. కారులో ప్రయాణిస్తున్న వ్యక్తి వివరాలు తెలియాల్సి ఉంది. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు లేదని గంట్యాడ పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి మృతదేహం లభ్యం



చింతపల్లిబీచ్‌లో లభ్యమైన అచ్యుతరావు మృతదేహం

పూసపాటిరేగ: మండలంలోని చింతపల్లిబీచ్‌లో దేవీ విగ్రహం నిమజ్జనం కార్యక్రమానికి వెళ్లి సముద్రంలో ఆదివారం గల్లంతైన యువకుడి మృతదేహం సోమవారం సాయంత్రానికి లభ్యమైంది. గరివిడి మండలంలోని దుమ్మెద గ్రామానికి చెందిన యిజ్జుపురపు అచ్యుతరావు(25) గ్రామస్తులతో కలిసి ఆదివారం సాయంత్రం 4 గంటల సమయంలో చింతపల్లి బీచ్‌లో దేవి విగ్రహాన్ని నిమజ్జనం చేస్తుండగా కెరటాల ఉధృతికి గల్లంతైన విషయం విదితమే. పోలీసులు, బంధువులు గాలించడంతో ఎట్టకేలకు చింతపల్లి రేవు సమీపంలో మృతదేహం ఒడ్డుకు కొట్టుకు వచ్చింది. మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం సుందరపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు పూసపాటిరేగ ఎస్సై ఐ. దుర్గాప్రసాద్ కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బాధ్యతల స్వీకరణ

విజయనగరం అర్బన్: సర్వే శాఖ ఎ.డిగా రమణమూర్తి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. అమరావతిలోని సీఆర్‌డీఏలో పని చేస్తున్న ఈయన బదిలీపై జిల్లాకు వచ్చారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన త్రివిక్రమరావుకు అమరావతికి బదిలీ అయింది.

ముగిసిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన



విజేతలకు జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈఓ ప్రేమకుమార్

విజయనగరం అర్బన్: విజయనగరం ఉత్సవాల్లో భాగంగా స్థానిక కోటలో జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులుగా జరుగుతున్న విద్యా, వైజ్ఞానిక ప్రదర్శన సోమవారంతో ముగిసింది. 225 ప్రాజెక్టులు ప్రదర్శించగా.. అందులో 15 ప్రాజెక్టులను ఉత్తమమైనవిగా ఎంపిక చేశారు. ఈ మేరకు ప్రాజెక్టులను రూపొందించిన వారికి ప్రశంసాపత్రాలు అందజేశారు.

రోగులతో ఆస్పత్రి కిటకిట

సీతంపేట: స్థానిక ఏరియా ఆస్పత్రి రోగులతో సోమవారం కిటకిటలాడింది. వివిధ రకాల ఇబ్బందులతో ఆస్పత్రికి వచ్చిన రోగులు ఓపీ కౌంటర్ వద్ద 350 మందికి పైగా క్యూ కట్టారు. వారిలో విషజ్వరాలు ఎక్కువగా ఉండడంతో అవసరమైన వారిని ఇన్‌పేషెంట్‌గా నమోదు చేసి వైద్యసేవలందిస్తున్నారు. మందులన్నీ అందుబాటులో ఉన్నాయని ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాసరావు తెలిపారు.



క్యూలో బారులు తీరిన భక్తులు

అమ్మవారిని దర్శించుకున్న కేంద్ర మాజీ మంత్రి అశోక్ కుటుంబ సభ్యులు

జాతరో.. జాతర..!

- పైడితల్లి సంబరానికి శ్రీకారం
- సంప్రదాయబద్ధంగా ముగిసిన తొలేళ్లు
- అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించిన అనువంశిక ధర్మకర్త అశోక్‌గజపతిరాజు
- ఘటాలతో అమ్మవారిని దర్శించి తరించిన భక్తులు
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు
- నేడు సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3 గంటల 5 నిమిషాలకు ముహూర్తం
- రాష్ట్ర ప్రభుత్వం తరఫున పట్టు వస్త్రాలు సమర్పించనున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

వరుణ దేవుడు కరుణించేలా..పుడమి తల్లి పులకించేలా.. ఏడాదంతా వాతావరణం అనుకూలించేలా..సాగు చేసిన పంట పచ్చగా విస్తరించేలా..అన్నం పండించే అన్నదాత మదిలో సంతోషం నింపేలా..ఆశీర్వదించమ్మా పైడితల్లమ్మా.. అంటూ రైతన్నలు ఏరువాక సాగేందుకు సన్నద్ధమయ్యారు. విజయనగరంజిల్లా ప్రజల ఇలవేల్పు శ్రీ పైడితల్లమ్మ జాతరలో తొలేళ్లసంబరం రైతన్నల పండగగా ప్రసిద్ధి కెక్కింది. ఏడాది పొడవునా మంచి పంటలు సమృద్ధిగా పండాలని ఈ తొలేళ్ల ఉత్సవం సందర్భంగా రైతులు కోరుకుంటూ అమ్మవారి అనుగ్రహంతో వచ్చిన విత్తనాలను పొలంలో చల్లి నాగలితో తొలుత దున్నాలి. దానినే తొలి ఏరు అని..తొలేళ్లని పిలుస్తారు. అమ్మవారి సిరిమానోత్సవానికి ముందురోజు తొలేళ్ల సంబరాన్ని సంప్రదాయబద్ధంగా నిర్వహించారు.



అమ్మవారి పట్టు వస్త్రాలు పల్లకిని మోస్తున్న ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు



విచిత్ర వేషధారణలు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీ పైడితల్లి అమ్మవారి జాతరకు తొలిఘట్టం తొలేళ్ల ఉత్సవంతో శ్రీకారం చుట్టారు. వేకువజామునుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు, పూజాదికాలు నిర్వహించారు. ఆలయ అనువంశిక ధర్మకర్త పూసపాటి అశోక్ గజపతిరాజు కుటుంబ సమేతంగా ఉదయం 8.30 గంటలకు అమ్మవారిని దర్శించుకున్నారు. రాజవంశం ఆచారం ప్రకారం అమ్మవారికి కోటలో నుంచి పల్లకీలో అమ్మవారికి పసుపు, కుంకుమలు, పండ్లు, పట్టువస్త్రాలను తీసుకువచ్చారు. ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆయనకు వేదాశీస్సులు అందజేశారు. ఆయనతో పాటు ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మీగజపతిరాజులు ఉన్నారు.

ఘటాలతో నివేదన

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నగరంలోని పలువురు భక్తులు వివిధ వేషధారణలతో..డప్పు మోతలతో, ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. మహిళలు, పురుషులు సైతం అమ్మవారికి ప్రీతిపాత్రమైన..ఆమె ప్రతిరూపమైన ఘటాలను నెత్తిన పెట్టుకుని అమ్మవారికి నివేదించి తరించారు. తొలేళ్ల ఉత్సవం రోజున ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 25వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ నిర్వహణాధికారులు అంచనా వేస్తుండగా, వారిలో జిల్లా నుంచే కాకుండా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థలు ఉచిత మంచినీరు, మజ్జిగ వితరణ గావించగా, మరికొందరు ఆహారపొట్లాలు అందజేశారు. ఎన్‌సీసీ క్యాడెట్లు, పోలీసు సేవాదళ్‌తో పాటు పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు భక్తులకు సేవలందించారు. పండగ నేపథ్యంలో నగరానికి పెద్దసంఖ్యలో భక్తులు చేరుకోగా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తొలేళ్ల ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. ఉత్సవాల కోసం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో నగర రహదారులు కిటకిటలాడాయి. కోట జంక్షన్‌లో ఏర్పాటుచేసిన నాటకాలు, పులివేషాల ప్రదర్శన పోటీలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు.

సంప్రదాయబద్ధంగా తొలేళ్ల సంబరం

సిరిమాను ఊరేగింపు నిర్వహించడానికి ముందు రోజు తొలేళ్ల ఉత్సవం నిర్వహిస్తారు. ఈ ఉత్సవం ప్రత్యేకించి రైతుల కోసం జరుగుతుంది. తొలిఏరు అనేది వ్యవసాయానికి సంబంధించిన పదం. ఏరువాక అంటే నాగలితో దున్నిన భూమి. అమ్మవారు ఇచ్చిన విత్తనాలు వేసి దున్నితే పంటలు బాగా పండుతాయని రైతుల విశ్వాసం. ఇందుకోసమే ప్రత్యేకంగా తొలేళ్ల ఉత్సవాన్ని నిర్వహిస్తారు. ముందుగా ఘటాలను ఊరేగింపుగా కోటశక్తి వరకూ తీసుకెళ్లి పూజలు చేయిస్తారు. అనంతరం ఆలయానికి తీసుకువచ్చి అక్కడ వాటిని ఉంచుతారు. ఆలయాన సంప్రదాయబద్ధంగా మొత్తం ఆరు ఘటాలుండగా అందులో రెండు పంచలోహాలతో చేసిన తల్లి ఘటాలు ఉంటాయి. మిగిలిన నాలుగు కంచుతో చేసినవి. వీటిని ఆలయం వద్దకు తీసుకువచ్చిన తర్వాత ఆలయ పూజారి అమ్మవారి కథను భక్తులకు వినిపిస్తారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేస్తారు. ఆ విత్తనాలు పొలంలో జల్లి రైతులు దున్నడం ప్రారంభిస్తారు. తద్వారా అమ్మవారి కరుణా కటాక్షంతో అధిక దిగుబడులు వస్తాయని రైతుల నమ్మకం. కాబట్టి దీన్ని తొలేళ్ల ఉత్సవంగా పేర్కొంటారు. ఈ కార్యక్రమాన్ని ఆలయ పూజారి బంటుపల్లి వెంకటరావు, సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు.



ఘటంతో యువతి



అమ్మవారిని దర్శించుకున్న జెడ్పీచైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుటుంబసభ్యులు

పైడితల్లిని దర్శించిన జెడ్పీ చైర్మన్

విజయనగరం ఫోర్ట్: వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ అధినేత వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి ఆశీస్సులు అందించాలని పైడితల్లి అమ్మవారిని వేడుకున్నట్టు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పైడితల్లి అమ్మవారిని దర్శించుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు. ఆలయ అధికారులు అధికారలాంఛనాలతో ఆయనకు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రభుత్వం ఏర్పాట్లు చేయాలని కోరారు. జిల్లా ప్రజలకు సుఖ సంతోషాలు ప్రసాదించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.



కోట నుంచి అమ్మవారి ఆలయానికి పండ్లు ఫలాలను తీసుకువస్తున్న ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మహిళలు

సిరులతల్లి సిరిమానోత్సవం..

చూసొద్దాం రా రండి

సిరిమానోత్సవం.. ఈ పేరు వింటే భక్తకోటి పరవశించిపోతుంది. సిరిమాను పూజారి రూపంలో నగర వీధుల్లోకి పైడితల్లి అమ్మవారు తరలివచ్చే దృశ్యాన్ని కనులారా వీక్షించేందుకు భక్తకోటి పరితపిస్తోంది. రెండున్నర శతాబ్దాల చరిత్రను సొంతం చేసుకున్న పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సం ముహూర్తం ప్రకారం మంగళవారం మధ్యాం 3.05 గంటలకు ఆరంభం కానుంది. ఉత్సవంలో పాల్గొనేందుకు లక్షలాది మంది భక్తులు ఇప్పటికే జిల్లాకు చేరుకున్నారు. ప్రతి ఇల్లు పండగ శోభను సంతరించుకుంది. ఓ వైపు విజయనగర ఉత్సవాలు మరోవైపు పైడితల్లి పండగ శోభతో విద్యలనగరం వెలిగిపోతోంది. భక్తులకు ఇబ్బంది కలగకుండా రెండువేల మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు.



- నేడు పైడితల్లి సిరిమానోత్సవం
- మధ్యాహ్నం 3 గంటల నుంచి ఉత్సవం ప్రారంభం
- ఈ ఏడాది ఐదు లక్షలకుపైగా భక్తులు వచ్చే అవకాశం
- విజయనగరానికి పండగ శోభ
- ఏర్పాట్లు పూర్తిచేసిన జిల్లా అధికార యంత్రాంగం



పైడితల్లికి ఘటాలు సమర్పించేందుకు బారులు తీరిన భక్తులు

విజయనగరం టౌన్ :

ఒకప్పుడు గ్రామదేవత. ఇప్పుడామె ప్రజలందరి దేవత. పైడితల్లి కీర్తి ఎల్లలుదాటింది. పసిడితల్లి కరుణా కటాక్షాల కోసం ఎక్కడెక్కడి నుంచో సిరిమాను పండగ నాటికి విజయనగరం చేరుకుంటారు. సిరిమాను రథం ఊరేగింపు ప్రారంభమయ్యేసరికి మూడులాంతర్లు, రాజా బజారు, కోట కూడలికి చేరుకుంటారు. పూజారి రూపంలో అమ్మవారిని దర్శించుకుని తరిస్తారు. సిరిమానోత్సవం విజయవంతమయ్యేందుకు అధికార యంత్రాంగం పెద్దఎత్తున ఏర్పాట్లు చేసింది. మధ్యాహ్నం 3 గంటల ఐదు నిమిషాలకు ప్రారంభమయ్యే సిరిమానోత్సవంలో ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు ఎనిమిదో సారి సిరిమానును అధిరోహించనున్నారు. సుమారు ఐదు లక్షలకిపైగా భక్తులు తరలివస్తారని అధికారుల అంచనా.

అన్నీ రసవత్తర ఘట్టాలే...

భక్తులనువిశేషంగా ఆకట్టుకునే సిరిమానోత్సవంలో అన్నీ రసవత్తర ఘట్టాలే. 58 అడుగుల పొడవున్న సిరిమాను ఉపరితలంలో బిగించే ఇరుసుపై ప్రధాన పూజారి విసనకర్ర చేతబట్టి ఆశీనులవుతారు. రెండో చివర రథంపై అమర్చిన ఇరుసును మానుకు అమరుస్తారు. దాని ఆధారంగానే మాను పైకి లేస్తుంది. గజపతిరాజు వంశీయుల తరపున ఒకరు తాడు లాగడంతో ప్రారంభమయ్యే సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్దగల పైడితల్లి అమ్మవారి గుడి వద్ద నుంచి రాజాబజారు మీదుగా కోట వరకూ మూడుసార్లు తిరుగుతుంది. ఊరేగింపు ఆద్యంతం సిరిమాను పూజారిని భక్తులు అరటి పండ్లతో కొలుస్తారు.

అత్యంత నియమనిష్టలతో...

అత్యంత నియమనిష్టలతో, ఉపవాసంతో ఉండే సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు హుకుంపేటలో మధ్యాహ్నం 12 గంటలకు బయలుదేరుతారు. దారిపొడవునా భక్తులు పూజారి పాదాలపై పసుపునీళ్లు పోసి దీవెనలు అందుకుంటారు. చంటిపిల్లలపై నుంచి పూజారి దాటితే వారికి మేలు జరుగుతుందన్న నమ్మకంతో చాలా మంది ఆయనొచ్చే దారిలో వారిని నేలపై ఉంచుతారు. పూజారి ఆలయానికి చేరుకున్నాక సిరిమానోత్సవం ప్రారంభమవుతుంది. 260 ఏళ్ల చరిత్ర గల సిరిమాను చదురుగుడి నుంచి మహారాజా కోట వరకు మూడు పర్యాయాలు తిరిగి భక్తులను ఆశీర్వదించనుంది. సిరిమాను ముందుండే బెస్తవారి వల, పాలధార, తెల్ల ఏనుగు, అంజలి రథాలు ఆకర్షణగా నిలుస్తాయి.

బెస్తవారి వల

రెండున్నర శతాబ్దాలకు మునుపు పైడితల్లి పెద్దచెరువులో నిక్షిప్తమైనప్పుడు పతివాడ అప్పలనాయుడు కలలో అమ్మవారు చెప్పిన సమాచారం మేరకు పైడితల్లి మూల విరాట్‌ను చెరువు నుంచి వెలికి తీయడంలో విజయనగరం యాతవీధికి చెందిన జాలర్లు సహకరించారు. అమ్మ సాక్షాత్కారానికి ఆదిలోనే పాత్రులైన ఆ బెస్తలే కీలకంగా వ్యవహరించారు. నాటి నుంచి నేటి వరకూ ఏటా ఈ వలను యాతవీధి జాలర్లు తయారుచేస్తుంటారు. చేపల వేటకు వెళ్లేటప్పుడు వాడే ప్రతి వస్తువును వల కింది భాగంలో ధరించి ఉత్సవంలో పాల్గొంటారు. వీరంతా ఒంటికి పసుపు రాసుకుని, వేపకొమ్మలు, జాలరి వస్తువులను చేతబట్టి సంబరంలో ఉత్సాహంగా ముందుకు సాగుతారు.

పాలధార

సిరిమాను సంబరం ప్రారంభానికి ముందు పాలధార ఆలయానికి రావడం అనాదిగా వస్తున్న ఆచారం. జాలరి వలను వెన్నంటే ఈటెలు చేతపట్టి వచ్చే ఈ జనం మహాశక్తి స్వరూపాలుగా భావిస్తారు. పాలధారగా పిలిచే ఈ జనధార అమ్మవారి సైనిక శక్తికి వారసులంటారు. తొలుత కొందరు ఈటెలను ధరించి అమ్మవారి ఆలయానికి వస్తారు. అక్కడ పైడిమాంబను దర్శించుకున్న అనంతరం డప్పు వాయిద్యాలతో కోట వద్దకు చేరుకుంటారు. అక్కడ పూజలు చేసి కోట పశ్చిమ భాగం వైపు వెళ్లి, కోట శక్తికి నమస్కరిస్తారు. సైనికులుగా పనిచేసే వీరంతా ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలన్న భావనతో గ్రామ కట్టడి చేస్తారు. ఈ ఘట్టంలో సాకేటివీధికి చెందిన డోకుల, మండల, అలుగోలు, రామవరపు కుటుంబ సభ్యులు పాల్గొంటారు.

అంజలి రథం

సిరిమాను జాతరలో అంజలిరథానికి విలక్షణమైన స్థానం. సిరిమానుకు అంజలి ఘటిస్తూ ముందుకు సాగుతుంది. కాబట్టి దీనిని అంజలి రథమని పిలుస్తారు. పైడిమాంబను నమస్కరిస్తూ అంజలి రథంపై ఉన్న నడిపేన, కోరాడ కుటుంబాల వారు ముందుకు సాగుతారు. నాటు బండిపై రోలును బిగించి, దానికి అటు, ఇటు రాటలను కడతారు. దానిపై ఐదుగురు పురుషులు మహిళల వేషధారణలో కూర్చొంటారు. వీరంతా ఆరుమూరల నార చీరను, చేతికి వెండి సందెలను ధరిస్తారు. సంబరం ప్రారంభానికి ముందు ఊరేగింపుగా చదురుగుడి వద్దకు వస్తారు. వీరంతా అమ్మవారి పరిచారికలుగా వ్యవహరిస్తారు. సంబరం జరుగుతున్నంత సేపూ భక్తులపై అక్షితలు విసురుతుంటారు.

తెల్ల ఏనుగు

పైడితల్లి సిరిమాను సంబరంలో తెల్ల ఏనుగుకు విశిష్ట స్థానం ఉంది. పూసపాటి గజపతులు ముస్తాబు చేసిన అంబారీ ఏనుగుపై కూర్చొని సంబరంలో పాల్గొనేవారు. సిరిమానుకు ముందు పట్టపుటేనుగు నడిచేది. రాచరికం అంతరించి, ప్రజాస్వామ్యం వచ్చాక పట్టపుటేనుగుకు గుర్తుగా 1956 నుంచి ఏనుగు ఆకారంలో ఒక బండిని ప్రదర్శిస్తున్నారు. ఈ ఏనుగుపై ఒక పురుషుడు, ఏడుగురు పురుషులు స్త్రీ వేషాలను ధరించి కూర్చొంటారు. స్త్రీలంతా పైడితల్లమ్మకు అక్కాచెల్లెళ్లైన గ్రామదేవతలుగా, మగవేషంలో ఉన్న వ్యక్తి అమ్మవారి సోదరుడు పోతురాజుగా భావిస్తారు. వెదురుతో తయారైన ఈ ఏనుగుపై భోగాపురం, పెద్దింటి తదితర కుటుంబ సభ్యులు కూర్చుంటారు.

కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియ పూర్తి చేయాలి

పార్వతీపురంటౌన్: 2024- 25వ విద్యా సంవత్సరానికి గాను కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లకు అర్హులైన విద్యార్థుల కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ ప్రక్రియను పూర్తి చేయాలని సాంఘిక సంక్షేమశాఖ అధికారి మహమ్మద్ గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఉన్న కళాశాలల ప్రిన్సిపాల్స్ సిబ్బందిని ఈ సందర్భంగా ప్రకటనలో కోరారు. కొత్త రిజిస్ట్రేషన్, రెన్యువల్ చేయడానికి హెచ్‌టీటీపీ//జ్ఞానభూమివి2.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/వెబ్‌పోర్టల్ కళాశాల ప్రిన్సిపాల్ లాగిన్‌లో పొందుపరిచామని పేర్కొన్నారు. కొత్త దరఖాస్తులు, రెన్యువల్, నమోదు ప్రక్రియను ఈ నెల 30లోపు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఆయా కళాశాలల్లో స్కాలర్‌షిప్ విభాగంలో వి ధులు నిర్వహిస్తున్న సిబ్బంది తక్షణమే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు.

రెగ్యులైజేషన్ యాక్ట్ పునరుద్ధరించాలి

కొమరాడ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులర్ చేయాలని కోరుతూ పసుపు రిబ్బన్లతో వారంతా నిరసన తెలియజేస్తూ రెగ్యులైజేషన్ యాక్ట్ 30 ప్రకారం జీవో 114ను ప్రభుత్వం పునరుద్ధరించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా సోమవారం వారు మాట్లాడుతూ ప్రభుత్వం తమపై దయ చూపి సమస్య పరి ష్కారించాలని వేడుకున్నారు. అలాగే ఈ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి 19వ తేదీ వరకు మా అభ్యర్థన తెలియజేస్తామని చెప్పారు.

రెండు ఇసుక రీచ్‌లకు టెండర్లు పూర్తి

విజయనగరం ఫూల్‌బాగ్: జిల్లాలోని రెండు ఇసుక రీచ్‌లకు సంబంధించి టెండర్లు పూర్తయినట్లు మైన్స్ డీడీ ఇ.నరసింహారెడ్డి తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సంతకవిటి మండలంలోని తమరాం, తెర్లాం మండలంలోని కుసుమూరు ఇసుకరీచ్‌లకు నాలుగు దరఖాస్తులు అందినట్లు పేర్కొన్నారు. రెండు రీచ్‌లను హైదరాబాద్‌కు చెందిన అఫ్జల్ టెక్నాలజీ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ దక్కించుకుందన్నారు. ఈ నెల 16 నుంచి ఈ రీచ్‌ల నుంచి ఇసుక తీయడం జరుగుతుందన్నారు.